

యామినీ కృష్ణమూర్తి కన్నుమూత

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో

భారత దేశం గర్వించదగిన నృత్యకారిణి, పద్మవిభూషణ్ యామినీ కృష్ణమూర్తి (84) ఢిల్లీ అపోలో ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు .1940లో మదనపల్లెలో జన్మించిన ఆమె తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన నర్తకిగా పని చేశారు. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో ఆమె నిష్ణాతురాలు. కూచిపూడి నృత్యానికి దేశవిదేశాలలో ఎనలేని పేరు తెచ్చిపెట్టారు. ఆమె లేని లోటు నృత్య కళా రంగంలో ఎవరూ తీర్చలేరని సిఎం చంద్రబాబునాయుడు ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

(ఫైల్‌ఫొటో)

'సుగుణమ్మే' మాకు కావాలి

సంఘమిత్రకు అండగా పుల్లారెడ్డి కండ్రిగ మహిళలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్కీం వర్కర్లపై అధికార పార్టీ నేతల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ముగిసిన ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా పనిచేశారన్న అక్కస్సుతో రాజకీయ కక్ష తోటి, తప్పుడు ఫిర్యాదులతోటి ఎలాగోలా స్కీం వర్కర్లపై వేటు వేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగలో సంఘమిత్ర గా పనిచేస్తున్న సుగుణమ్మ అనే మహిళను రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వెలుగు శాఖ అధికారులు తొలగించే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా శనివారం పుల్లారెడ్డికండ్రిగలో వివో పొదుపు సంఘాలతో గ్రామ సభ పెట్టి

సంఘమిత్రపై అభిప్రాయ సేకరణ చేశారు. దీంతో పొదుపు మహిళలంతా ముక్తకంఠంతో సుగుణమ్మ తీసివేతను తాము ఒప్పుకోమంటూ స్పష్టం చేశారు. రాజకీయాలు తమకు అవసరంలేదనీ, సుగుణమ్మ సంఘాల నిర్వహణ సమర్ధవంతంగా నడుపుతోందనీ, సంఘాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను సకాలంలో అందిస్తుందని వెల్లడించారు. ఒకవేళ ఆమెను బలవంతంగా తీసివేయాలని చూస్తే తాము రుణాలు కూడా కట్టబోమని హెచ్చరించారు. దీంతో పొదుపు సంఘాల మద్దతుతో సుగుణమ్మను ఎలాగోలా తొలగించాలని చూసిన వెలుగు అధికారులకు నాలుక కరుచుకోవడం తమ వంతయ్యింది. పైగా తాము గ్రామసభ నిర్వహణకు మాత్రమే వచ్చామనీ, ఆమెను తొలగించాలనే ఆలోచన లేదంటూ బుకాయించి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఈ సంఘటనతో అనుకున్నదొకటి అయ్యిందొకటి కావడంతో సంఘమిత్ర పై రాజకీయ వేధింపులకు దిగిన అధికార పార్టీ నేతలు తోక ముడిచారు.

'జనసేన' దృష్టికి సంఘమిత్రల సమస్యలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలోని 13 గ్రామాలకు చెందిన సంఘమిత్రలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటాను శనివారం కలిశారు. గత 15 ఏళ్లుగా తాము ఈ సంఘమిత్ర ఉద్యోగంలో కొనసాగుతూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామనీ, ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధులుగా పని చేస్తున్నామని తెలిపారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత స్థానిక నాయకుల నుండి రాజీనామా చేయాలంటూ ఒత్తిళ్లు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం కోల్పోతే కుటుంబాలు రోడ్డున పడుతాయని బాధపడ్డారు. సమస్య పరిష్కరించి అండగా నిలబడాలని కోరారు. స్పందించిన వినుత సంఘమిత్రల్లో అధికంగా దళిత మహిళలు ఉన్నారనీ, వారి పొట్ట కొట్టే పనులు కూటమి ప్రభుత్వం చేయబోదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపు, ప్రతీకార చర్యలకు తావు లేదని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా వారి సమస్యను స్థానిక ఎమ్మెల్యే, ఉన్నత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి జనసేన పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పులికాట్ సరస్సు ముఖద్వార పూడికతీతపై సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీత ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఉపాధి, పర్యాటకరంగ అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జేసీ శుభంబన్సల్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పూడికతీత ద్వారా సముద్రం నుంచి నీరు సరస్సులోకి రావడానికి మార్గం సుగమం అవుతుందని, తద్వారా మత్స్యకారులకు చేపల వేట ద్వారా ఉపాధి దొరుకుతుందన్నారు. సరస్సులో ఎపుడూ నీరు ఉండటం వల్ల ఎకో సెన్సిటివ్ జోన్‌లో పులికాట్ నేలపట్టు పక్షుల అభయారణ్యం మెరుగుదల ద్వారా పలు రకాల పక్షులు వచ్చి సందర్శకులను ఆకట్టుకుంటాయని, తద్వారా పర్యాటక రంగం అభివృద్ధి అవుతుందన్నారు. మత్స్య, అటవీ శాఖ అధికారులు వివరిస్తూ పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీత కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సమానంగా నిధులు సమకూర్చే విధంగా రూ. 97.09 కోట్లకు సాగర మాల పథకం కింద అనుమతులు వచ్చాయని, నిధులు విడుదల కావాల్సి ఉందని తెలిపారు. పులికాట్ సరస్సుకు మూడు ముఖ ద్వారాల్లో ఒకటి పూడి రాయదరువు, రెండవది కొండూరు పాలెం (తూపిలి పాలెం దగ్గర) మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో, మూడవ ముఖ ద్వారం పెజావర్ గాడ్ తమిళనాడు రాష్ట్రంలో ఉందని తెలిపారు. ఆం.ప్ర లోని సదరు రెండు ప్రాంతాల్లో ఇసుక మేటలు పేరుకుపోయి సముద్రపు నీరు పులికాట్ సరస్సు లోకి రాకుండా అడ్డుగా ఏర్పడ్డాయని , పులికాట్ సరస్సు ఉత్తరం నుండి దక్షిణానికి ఏటవాలుగా ఉండడం వలన జూన్ నుండి ఫిబ్రవరి వరకు మాత్రమే మనకు పులికాట్ లో నీరు ఉంటుందని, అదే తమిళనాడు వైపు సంవత్సరం పొడుగునా పులికాట్ నందు నీరు ఉంటుందని, మార్చి నుండి జూన్ కాలంలో మన ఏపీ మత్స్యకారులను అటు వైపు అనుమతించడం లేదని సమస్య ఎప్పుడూ ఉంటోందని తెలిపారు. పులికాట్ సరస్సు 461 కిమీ లలో విస్తరించి ఉందని, ఏపీ లో 400 కిమీ విస్తరించి ఉందని, పూడిక తీత ద్వారా సముద్రం నీరు పులికాట్ లో చేరి చేపల వేట ద్వారా మత్స్యకారులకు జీవనోపాధి దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, సూల్లూరు పేట ఆర్డీఓ చంద్రముని, వైల్డ్ లైఫ్ డిఎఫ్ఓ శామ్యూల్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎ.నాగరాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

దళిత ప్రజాప్రతినిధి నియోజకవర్గంలో..

పొన్నాలమ్మ గుడిలోకి దళితులు 'నోఎంట్రీ'

- దర్బావారికండ్రిగలో అడ్డుకున్న పెత్తందారులు
- ఎఎస్‌ఐ లోకనాథంకు సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి - సత్యవేడు

దళిత ప్రజాప్రతినిధి నియోజకవర్గంలో కెవిబిపురం మండలం దర్బావారి కండ్రిగ దళితులను గ్రామదేవత పొన్నాలమ్మ గుడిలోకి రానీకుండా పెత్తందారులు అడ్డుకుంటున్నారని సిపిఎం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ అన్నారు. ఈ మేరకు శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ దళితులను ఆలయంలోనికి రానీయకపోవడం, పూజలు చేయనీకుండా అడ్డుకోవడం దారుణమని అన్నారు. దర్బావారికండ్రిగ అనే బ్రాహ్మణచెరువు గ్రామస్తులు, దళితులు పురాతనంగా పొన్నాలమ్మ గుడిలో కలిసే పూజలు చేసేవారు. అయితే గత నెలలో గ్రామస్తులు మాత్రమే పూజలు చేసి దళితులను రానీకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు గుడిలో పూజలు చేయడానికి సిద్ధపడితే పూజారిని సైతం రానీకుండా అడ్డుకున్నారన్నారు. ఇప్పటికీ దళితుల పట్ల వివక్ష పాటించడం సిగ్గుచేటని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు జోక్యం చేసుకుని ఆలయ ప్రవేశం దళితులతో చేయించాలన్నారు. పెత్తందారులతో తమకు గొడవ ఎందుకని, వేరే స్థలంలో గుడి కట్టుకోడానికి ప్రయత్నించగా ఆ స్థలంలోనూ తమకు వాటా ఉందని గ్రామస్తులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఏకంగా దళిత ఎంఎల్ఎ నియోజకవర్గంలోనే ఇలా జరగడం ఏంటని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దళితుల ఆలయ ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు నాగలాపురం నాగరాజు, జానపద కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య, దళితులు చిన్నబ్బ, వెంకటయ్య, వెంకట సుబ్బయ్య, రామారావు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు తహశీల్దార్ల కొరత

చిత్తూరుకు ఏడుచోట్ల తిరుపతిలో నాలుగుచోట్ల

ఇన్‌ఛార్జిలతోనే నెట్టుకొస్తున్న వైనం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉమ్మడి చిత్తూరు జిల్లాను తహశీల్దార్ల కొరత వేధిస్తోంది.. తిరుపతి జిల్లాలో నాలుగు చోట్ల, చిత్తూరుకు ఏడుచోట్ల గత రెండేళ్లుగా తహశీల్దార్లు లేరు. గత ప్రభుత్వం అధికారులకు పదోన్నతి కల్పించకపోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో 32 మండలాలకు సంబంధించిన తహశీల్దార్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ పోస్టింగ్‌లు ఇచ్చారు. పెద్దపంజాణి, తవణంపల్లి, పెనుమూరు, విజయపురం, ఐరాల, గంగవరం, వెదురుకుప్పం మండలాలకు తహశీల్దార్లు లేకపోవడంతో తాత్కాలికంగా ఏడుగురు డిప్యూటీ తహశీల్దార్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు. తిరుపతి జిల్లాలో తిరుపతి రూరల్, వెంకటగిరి, సత్యవేడు, నారాయణవనం మండలాలకు డిప్యూటీ తహశీల్దార్లను ఇన్‌ఛార్జిలుగా నియమించే అవకాశం ఉంది. గంగవరంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసే ఎంఎస్ ప్రసన్నకుమార్‌ను పెద్దపంజాణి తహశీల్దార్‌గా నియమించారు. అలాగే ఐరాల డిప్యూటీ తహశీల్దార్ ఎం.సుధాకర్‌ను తవణంపల్లికి, గుడిపాల డిటి బి.కల్యాణ్‌ను పెనుమూరుకు, చిత్తూరు అర్బన్‌లో పనిచేసే ఎస్.కిరణ్‌ను విజయపురానికి, పెనుమూరులో డిటిగా పనిచేసే మహేష్‌కుమార్‌ను ఐరాలకు, చిత్తూరు డిఎస్ఓ కార్యాలయంలో డిటిగా పనిచేసే జివిఎల్ శివకుమార్‌ను గంగవరం తహశీల్దార్‌గా, వెదురుకుప్పంలో డిటిగా పనిచేసే ఆర్.జయంత్‌ను యాదమరి తహశీల్దార్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు. జోన్ 4కు చెందిన చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు పరిధిలో ఉన్న తహశీల్దార్లకు ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్‌లో ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉంది. అప్పటివరకూ 11 మండలాల్లోనూ ఇన్‌ఛార్జి తహశీల్దార్ల పాలనే సాగనుంది.

రూ.కోటిన్నర ఎర్రచందనం స్వాధీనం

పాత నేరస్తుల నేతత్వంలో అక్రమ రవాణా

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

శేషాచలం అడవుల నుండి అక్రమంగా ఎర్రచందనం దోచుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న స్మగ్లర్ల ఆగడాలకు టాస్క్ ఫోర్స్ ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు చేస్తున్న నూతన సంస్కరణలు ఫలితాలను ఇస్తున్నాయి. తాజాగా 2497 కేజీల 84 ఎర్రచందనం దుంగల సహా లగేజీ వాహనం, ఇన్నోవా కారును అధికారులు సీజ్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ ఎస్పి శ్రీనివాస్ ప్రత్యేక పర్యవేక్షణలో డీఎస్పీ చెంచుబాబుకు అందిన సమాచారంతో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి ప్రత్యేక బందాలుగా ఏర్పడి ప్రొద్దుటూరు నుండి సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం, పుట్టపర్తి ఫారెస్ట్ డివిజన్ హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి దామాజి పల్లి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించామని అధికారులు తెలిపారు. ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బందం వాహనాల తనిఖీలు చేస్తుండగా ఒక ఇన్నోవా కారు అతివేగంగా తనిఖీ పాయింటును దాటి వెళ్ళిందన్నారు. మరో లగేజ్ వాహనం వాహన

తనిఖీలను గమనించి వాహనం ఆపి ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. వారిని వెంబడించి కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీకి చెందిన షేక్ హుస్సేన్ వల్లి, తొండూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన కాసెట్టి మల్లికార్జునలను అదుపులోకి తీసుకొని లగేజ్ వాహనాన్ని పరిశీలించగా అందులో చెక్కబడిన ఎర్రచందనం దుంగలు 84 ఉన్నాయన్నారు. మురళీధర్ రెడ్డి ఫిర్యాదు మేరకు టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్న వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఈ అక్రమ రవాణాలో పాత ఎర్రచందనం స్మగ్లర్లు ఉన్నట్లుగా నిర్ధారించామన్నారు. సిబ్బందిని ఎస్పి అభినందించి నగదు రివార్డును ప్రకటించారు.

ఆ బ్యాంకులో 'ఆల్ కేర్లెస్'

ఖాతాదారులను పట్టించుకోని సిబ్బంది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆధ్యాత్మిక పట్టణంగా దినదినాభివద్ధి చెందుతున్న శ్రీకాళహస్తిలో నిత్యం అత్యంత రద్దీగా ఉండే బ్యాంకుల్లో ఎస్బీఐ ఏడీబీ(ఏసీబీగా పేరు మారింది) ఒకటి. రైతులు, డ్వాక్రా మహిళల ఆర్థికాభివద్దే లక్ష్యంగా ఈ బ్యాంకు సేవలందిస్తోంది. ముఖ్యంగా డ్వాక్రా మహిళలు, రైతుల సహకారంతో దినదినాభివద్ధి చెందుతున్న ఈ బ్యాంకులో డ్వాక్రా మహిళలు, రైతుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కేవలం డ్వాక్రా మహిళలు జరుపుతున్న కోట్ల రూపాయల ఆర్థిక లావదేవీల కారణంగానే ఆ బ్యాంకు లక్ష్యాలను అధిగమించి అభివద్ధి పథంలో నడుస్తోంది. ఈ కారణంగానే అగ్రికల్చర్ డెవలప్మెంట్ బ్యాంకు(ఏడీబీ)గా ఉన్న పేరును కాస్త అగ్రికల్చర్ కమర్షియల్ బ్యాంకు(ఏసీబీ)గా మార్చారు. అయితే అక్కడ పనిచేస్తున్న కొందరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 'ఆల్ కేర్లెస్ బ్యాంకు'గా మారిందన్న విమర్శలు వస్తున్నాయి.

రేపు రండి చూద్దాం

స్థానిక ఏసీబీ బ్యాంకులో కమర్షియల్ ఖాతాలకంటే అగ్రికల్చర్, ఎస్‌హెచ్‌జి ఖాతాలే అధికం. ఇక్కడ రుణాలు పొందుతున్న ఎస్.హెచ్.జీ గ్రూపుల మహిళలు నెల నెలా క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్నారు. ఎస్.హెచ్.జీ గ్రూపుల ద్వారా నెలకు ఈ బ్యాంకులో సుమారు రూ.50 కోట్ల వరకు ఆర్థిక లావాదేవీలు నడుస్తున్నాయి. ఇక్కడ రుణం పొందుతున్న వారిలో కమర్షియల్, అగ్రికల్చర్ విభాగాల్లో ఎగవేత ఖాతాలు ఉన్నాయేమో గానీ, ఎస్.హెచ్.జీల్లో మాత్రం ఒక్కటంటే ఒక్క గ్రూపు కూడా డిఫాల్ట్ ప్రమాదంలో లేదు. ఇంతలా క్రమశిక్షణతో రుణాలను చెల్లిస్తున్న డ్వాక్రా మహిళలతో అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు దారితీస్తుంది. శనివారం తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి గ్రామం నుంచి స్త్రీ నిధి, ఉన్నతి రుణం కోసం రెండు ఎస్.హెచ్.జీ గ్రూపుల నుంచి మహిళలు ఏసీబీ బ్యాంకు కు వచ్చారు. అయితే అక్కడ ఫీల్డ్ అధికారి లేరంటూ సిబ్బంది తిప్పి పంపారు. రేపు రండి, ఎల్లుండి రండి అంటూ ఉచిత సలహా ఇచ్చారు. గ్రామాల నుంచి వచ్చే మహిళలు ఎంతో వ్యయప్రయాసలకోర్చి, పనులు మాని, సమయాన్ని వెచ్చించి ఇక్కడికి వస్తుంటారు. వారికి సరైన సహకారం అందించి సకాలంలో పని పూర్తి చేసి పంపాల్సిన బాధ్యత బ్యాంకు సిబ్బందిపై ఉంటుంది. అయితే సిబ్బంది మాత్రం దురుసుగా సమాధానాలు ఇస్తుండడంతో మహిళల మనసు నొచ్చుకుంటోంది. స్త్రీ నిధి, ఉన్నతి రుణాలను సాధారణంగా బ్యాంకు ఇవ్వదు. రుణాలు కావలసిన సంఘాలు స్త్రీ నిధికి, ఉన్నతికి అభ్యర్థన పంపితే ప్రభుత్వమే వారికి రుణం మంజూరు చేస్తుంది. ఆ రుణం పొదుపు

సంఘాల ఖాతాలో పడుతుంది. ఆ రుణాన్ని ఆయా సభ్యుల ఖాతాలోకి జమ చేసేందుకు ఏసీబీ బ్యాంకు అధికారులు మూడు రోజులుగా తిప్పించుకోవడం ఎంతవరకు సమంజసమని మహిళలు ప్రశ్నిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఆ బ్యాంకులో 'ఆర్' అనే అక్షరంతో మొదలయ్యే పేరున్న ఓ అధికారి ప్రతి ఎస్ హెచ్ జి లావాదేవీలపై పనిగట్టుకుని ఏదో ఒక సాకు చూపి మహిళలను తిప్పించడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నారని మహిళలు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఈ బ్యాంకులో 'నిర్లక్ష్యం' ఇలాగే కొనసాగితే తమ లావాదేవీలను వేరేచోటకు మార్చాలని మహిళలు వాపోతున్నారు.

ఎర్రటి ఎండలో విద్యార్థులకు 'శిక్ష'

ప్రజాశక్తి - రేణిగుంట

ఎర్రటి ఎండలో విద్యార్థులను మోకాళ్లపై నిలబెట్టి శిక్ష విధించిన శ్రీ వెంకటేశ్వర స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి డిమాండ్ చేశారు. కలెక్టర్, విద్యాశాఖాధికారి స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. పసిపిల్లలన్న కనికరం లేకుండా ఎర్రటి ఎండలో నిలబెట్టిన వైనం బాధాకరమని, ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కలెక్టర్‌కు, డిఇఒకు పంపామని, సమగ్ర విచారణ జరిపి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్వీయూలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ఛైర్ పర్సన్

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి జాతీయ మానవహక్కుల కమిషన్ అధ్యక్షురాలు యస్. విజయ భారతి విచ్చేశారు. ఎస్వీయూ ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయడులతో మానవ , మహిళా హక్కుల గురించి అనేక విషయాలు చర్చించారు. త్వరలో జాతీయ స్థాయిలో సదస్సు ఎస్వీయూలో నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎస్వీయూ పక్షాన అధికారులు తమవంతు సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. విశ్వవిద్యాలయం చేపడుతున్న పలురకాల సంరక్షణ చర్యల్ని విసి , రిజిస్ట్రార్లు ఛైర్ పర్సన్‌కు వివరించారు.

కమిషనర్ బంగ్లా నిర్మాణం పరిశీలన

తిరుపతి టౌన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సమీపంలో నిర్మాణం జరుగుతున్న కమీషనర్ బంగ్లాను శనివారం ఉదయం తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కాంపౌండ్‌వాల్ త్వరగా కట్టాలన్నారు. మేయర్ వెంట నగరపాలక సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్ తేజస్విని వున్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో దీర్ఘకాలికంగా పేరుకుపోయి ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను సిపిఎం బృందం కలిసి వినతిపత్రం అందించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం మాట్లాడుతూ శెట్టిపల్లి పరిధిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వం సేకరించిన ప్లాటుదారులకు కార్పొరేషన్ ద్వారా వెంటనే లేఔట్లు వేసి స్థలాలు కేటాయించాలన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి గ్రామంలో సర్వే నెంబర్ 125/1 లో 125 ఎకరాలు ఆక్రమించుకొని హైకోర్టు స్టే తో గ్రావెల్ అమ్ముకుంటున్న ప్రవేటు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే స్థలంలో ఇల్లు లేని పేదలు గుడిసెలు వేసుకున్న వారిని తొలగించి, అర్హులకి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పిన ప్రకారం స్థలాలు కేటాయించాలన్నారు. ఓజిలి మండలం వీర్ల గునపాడు గ్రామంలో పేదలు సాగు చేసుకుంటున్నా భూములను ఆక్రమించుకొని తప్పుడు కేసులు పెడుతున్న పెంచులు రాజు పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బి ఎన్ కండ్రిగ మండలం కుక్కంబాకం గ్రామంలో 80 ఎకరాల దళితుల భూమిని ఆక్రమణకు పాల్పడుతున్నారని అన్నారు. జిల్లాలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు లేకుండా, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తానని, శెట్టిపల్లి సమస్య తన దష్టిలో వుందని సీపీఎం నేతలకు తెలిపారు.

పింఛన్...'అధికార' టెన్షన్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

ఒకటోతేది వచ్చిందంటే జిల్లా యంత్రాంగంలో టెన్షన్ మొదలవుతుంది. ఎక్కడెక్కడ ఎలాంటి లబ్దిదారులు ఉండారో ఎంపిక చేసుకుని, వారికి ప్రభుత్వ పరంగా అందించాల్సిన పింఛన్ కోసం కసరత్తు ప్రారంభిస్తారు. అయితే వివిధ కారణాలు చూపుతూ నెలనెలా పింఛన్ అందించే లబ్దిదారుల సంఖ్య తగ్గిస్తుండడంతో బాధితులు లబోదిబోమంటూ కలెక్టరేట్ వద్ద క్యూ కడుతుండటం గమనార్హం. టిడిపి కూటమి అధికారం చేపట్టిన తరువాత ప్రతినెలా వెయ్యి చొప్పున ఇప్పటికి మూడువేల మంది లబ్దిదారులకు పింఛన్ వేటు పడటం గమనార్హం.

ప్రతి నెల ఒకటో తారీఖు వస్తోందంటే జిల్లా కలెక్టర్ మొదలు కింద స్థాయి యంత్రాంగం వరకు టెన్షన్ మొదలవుతోంది. అనాథలు, అభాగ్యులు, వృద్ధులు, వితంతువులు, దీర్ఘకాలిక అనారోగ్య బాధితులకు ప్రభుత్వ పరంగా పింఛన్ రూపంలో తామున్నామంటూ ఆదుకునేవారు. గత ప్రభుత్వంలో వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి నెల ఒకటోతారీఖునే లబ్దిదారుల ఇంటి వద్దకే వారు నిద్రలేచే సరికి పెన్షన్ ఇంటి ముందే వేచి ఉండేది. దీంతో లబ్దిదారులు ఎలాంటి వ్యయప్రయాసలు పడాల్సిన పనిలేకుండా ఉండేది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఎన్నికలు ప్రారంభం కావడంతో లబ్దిదారులకు కష్టాలు తప్పలేదు. పాలకులు వారి వారి రాజకీయ ప్రయోజనాలు దృష్ట్యా లబ్దిదారులను సచివాలయాలు, బ్యాంకులు చుట్టు తిప్పారు. పైగా మూడు నెలలకు పెన్షన్ దారుల్లో కోతలకు అనధికారంగా సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా మూడు నెలల కాలంలో మూడువేల మందికి కోత విధించడం గమనార్హం. మే నెలలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 70 వేల 390 మంది లబ్దిదారులకుగాను రూ.80.47 కోట్ల రూపాయలు విడుదల చేశారు. జూన్‌లోలో 2 లక్షల 69 వేల 684 మంది లబ్దిదారులకు గాను రూ.80.47 కోట్ల రూపాయలను పంపిణీ చేశారు. జూలై నెలకు గాను 2 లక్షలకు 69 వేలే 162 మంది లబ్దిదారులను ఎంపిక చేసి ఎన్నికల మూడు నెలల అదనపు బోనస్‌తో కలిపి రూ.182.30 కోట్ల రూపాయలను విడుదల చేశారు. ప్రస్తుత ఆగస్టు నెలకు గాను 2 లక్షల 67 వేల 772 మంది లబ్దిదారులను ఎంపిక చేసి రూ.113.17 కోట్ల రూపాయలను విడుదల చేశారు. సాధారణ ఎన్నికలు ప్రారంభమైన మే నెలతో పోల్చుకుంటే జిల్లా వ్యాప్తంగా ప్రతి నెల వెయ్యిమంది చొప్పున లబ్దిదారులను తగ్గించడం గమనార్హం.

క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని రోటరీ క్లబ్ – గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో పోలిచర్ల పాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో సీనియర్ రోటేరియన్ రాంకుమార్ సాయంతో విద్యార్థులకు శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, జోనల్ సెక్రటరీ ధనంజయ రెడ్డి, బలరామి రెడ్డి, వాసు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెంగుళూరులో తెలుగు వారందరికీ కృతజ్ఞతలు:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఇటీవల ఎన్నికల్లో బెంగుళూరులో వున్న తెలుగు వారు తమ స్వగ్రామాలకు వచ్చి టిడిపి గెలుపునకు కృషి చేశారని

గాలి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వారందరికీ నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. బెంగుళూరు టిడిపి కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఎన్నికల్లో గెలిచిన పలువురు టిడిపి ఎమ్మెల్యేలను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమం లో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఘనంగా సన్మానించారు. హిందూపూర్ ఎంపీ బి కే పార్థ సారథి, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, అరణి శ్రీనివాసులు, ప్రసాద్, సుదర్శన్ రెడ్డి, సోమిరెడ్డి బాబు లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు టీడీపీ నాయకులు రాజేంద్ర నాయుడు, లీలా శంకర్ రావు, యస్వంత్, గజేంద్ర, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: పశుసంవర్ధక శాఖ హెల్త్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏర్పేడు మండలం కుక్కలగుంట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. ఏపాకాయనుపేట పశు వైద్యశాల చికిత్సాలు డాక్టర్ సి కృష్ణమోహన్ రెడ్డి (వి.ఎ.ఎస్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్లు నరేష్(ఎల్ఎస్ఏ), ఏహెచ్ఏలు రోహిత్, దామోదరం, పవన్ కళ్యాణ్, రాజశేఖర్(ఓఎస్) తదితర పశుసంవర్ధక శాఖ సిబ్బంది పశువుల నివారణ మందు పిచికారీ చేశారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు.

ఎఎంసి ఎన్నికలపై అవగాహన

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండల ఎంఈఓ కార్యాలయంలో ఎస్ఎంసి ఎన్నికల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన నిర్వహించారు. ఈ నెల 8వ తేదీ గురువారం ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని సత్యవేడు ఎంఈవో రవి కోరారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నిబంధనల మేరకు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను నిర్వహించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. ఆగస్టు 8వ తేదీన ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఒక్కో తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాల్సి ఉందన్నారు. కమిటీ ఎన్నిక పూర్తయిన తర్వాత సభ్యులతో ప్రతిజ్ఞ చేయించి ఎస్ఎంసి తొలి సమావేశాన్ని నిర్వహించాల్సి ఉందన్నారు.ఈ అవగాహన కార్యక్రమం లో ఎంఈఓ చంద్రశేఖర్, డిటి రవిచంద్రబాబు,ఎంఈఓ 2 ఉపేంద్రలు పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించండి : టీఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గత ఐదు సంవత్సరాలలో ఎస్వీయూ స్టోర్స్‌లో, గ్యాస్ గోడౌన్ లో జరిగిన అవినీతి, అక్రమాలపై లోతుగా విచారణ జరిపించి అవినీతికి పాల్పడిన ఉన్నతాధికారులను కఠినంగా శిక్షించాలని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ అశోక్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామకృష్ణ నాయుడు డిమాండ్ చేశారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడుకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీ స్టోర్స్ లో గత మూడు సంవత్సరాలలో కొనుగోళ్లలో భారీ అవినీతి చోటుచేసుకుందన్నారు. వీటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత చంద్రగిరి ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు, నర్సింహ, భీమేష్, రవి, గణేష్, రాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: సీనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రతి ఒక్కరికి ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి పై ఉందని మన ఆరోగ్యాన్ని మనమే జాగ్రత్తగా చూసుకోవాలని. పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎన్‌సి రాఘవేంద్ర తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతాలైన వినాయకపురంలో ఉచిత వైద్య శిబిరం, ప్రభుత్వ వైద్య సహకారంతో పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమశ్రీ, భార్గవి, ఆశ, ఎన్మైల వెంకట మోహన్, డిప్యూటీ తహశీల్దారు సురేష్ పుత్తూరు బారు అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తం, కార్యదర్శి మురళి రెడ్డి, పారా వాలంటీర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సెర్ఫ్ డెవలప్‌మెంటు డీన్ గా ఆచార్య నరసింహ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ గా వైరాలజీ విభాగానికి చెందిన ఆచార్య జగన్నాథం నరసింహను నియమిస్తూ ఎస్వీయూ విసి ఆచార్య అప్పారావు , రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఉత్తర్వులు అందించారు. తనకు అప్పగించిన బాధ్యతలను పరిశోధకులు, బోధన సిబ్బంది సహకారంతో సమర్థవంతంగా నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ అవకాశం కల్పించిన ఎస్వీయూ ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతి నిర్మాణానికి రూ.25 వేలు విరాళం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ తిరుపతి రూరల్ మండలం పేరూరుపల్లికి చెందిన ప్రత్యేక ప్రతిభావంతుడు జీవన్ కుమార్

ముఖ్యమంత్రికి విరాళం అందిస్తున్న జీవన్‌కుమార్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి అమరావతి రాజధాని నిర్మాణానికి తన వంతు సాయంగా 25 వేల రూపాయలను విరాళంగా అందించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మూడు రాజధానుల పేరుతో వైయస్ జగన్ అమరావతిని విచ్ఛిన్నం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టిడిపి ప్రధాన కేంద్ర కార్యాలయంలో అమరావతి నిర్మాణానికి తన వంతు సాయంగా రూ.25వేల నగదును ముఖ్యమంత్రి చంద్రబాబుకి అందించినట్టు ఆయన తెలిపారు. తిరుమల శ్రీవారి ప్రసాదాలను కూడా అందించానన్నారు. తాను మెట్ల మార్గంలో వెళ్లి మొక్కులు తీర్చుకున్నానని ముఖ్యమంత్రికి వివరించారు. జీవన్ కుమార్ భావోద్వేగానికి ముఖ్యమంత్రి మెచ్చు కుంటూ అభినందించి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని తెలియజేశారని తెలిపారు.

'ఉపాధి' కూలితలపై అవగాహన కల్పించాలి : పీడీ

ప్రజాశక్తి - ఏర్పేడు: ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.300 అందేలా కూలీలపై అవగాహన కల్పించాలని డ్వామా పీడీ ప్రసాద్ అన్నారు. ఏర్పేడు మండలంలోని మన్నసముద్రం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సివి శ్రీనివాస ప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ డి చంద్రశేఖర్ రాజు, అదనపు కార్యక్రమాధికారి అనిలాల దేవర, ఇంజనీర్ రవికుమార్, జూనియర్ ఇంజనీర్ భారతి పాల్గొన్నారు.

ఎస్వీయూలో కుంభకోణంపై విచారణ జరిపించండి : విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూలో గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన అక్రమ నియామకాల్లో అధికారులు, మధ్యవర్తులు దండుకున్న రెండు కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని బీజేపీవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి కే విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకురావాల్సిన 200 కోట్ల తీసుకురాకపోగా దాదాపుగా 160 మంది ఎన్ ఎమ్ ఆర్ లు, అతిథి ఆధ్యాపకులను అక్రమ మార్గాలలో తీసుకున్నారని ఆరోపించారు. ఈ నియామకాలపై విచారణ చేపట్టి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు పురుషోత్తం రెడ్డి, ప్రశాంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యత లోపం

- హోటళ్లలో బొద్దింకలు, పురుగులు
- చర్యలు తీసుకోవాలన్న వినియోగదారులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: చంద్రగిరి హోటళ్లలో బొద్దింకలు, పురుగులతో కూడిన నాణ్యతలేని ఆహారం కనిపిస్తోంది. పూర్తిగా నాణ్యత లేని ఆహారం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. చంద్రగిరిలో పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా వుంది పవిత్ర హోటల్ పరిస్థితి. భోజనంలో బొద్దింకలు ,పురుగులు ప్రత్యక్షం కావడంతో వినియోగదారులు 'ఇదేమిటి? ఇలా భోజనం పెడుతున్నారు?' అని ప్రశ్నిస్తే 'ఇష్టముంటే తినండి.. లేదంటే వెళ్లిపోండి..' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో హోటల్ యాజమాన్యం రెచ్చిపోతోంది. ఇప్పుడే వడ్డించే వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే వినియోగదారులు 10, 20 సార్లు అడిగినా పట్టించు కునే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరాయంగా తనిఖీలు చేపట్టాలని, నాణ్యతలేని అపరిశుభ్రంగా వున్న హోటళ్ల పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

ఆహార పదార్థాల్లో ఈగ కనిపిస్తున్న దృశ్యం

అన్నదానం ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన సుమధుర గ్రూప్ సిఎండి శ్రీ మధుసూదన్ టిటిడి అన్న ప్రసాదం ట్రస్టుకు ఒక కోటి రూపాయలు విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళం డిడీని తిరుమలలోని గోకులం అతిథి భవనంలోని టిటిడి అదనపు ఈవో కార్యాలయంలోదాత టీటీడీ అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు భరత్ కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్టోబరు 4 నుండి 12 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4వ తేదీ ప్రారంభమై 12వ తేదీ ముగుస్తాయని టిటిడి అదనపు ఈవో సిహెచ్‌వెంకయ్య చౌదరి పేర్కొన్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రెండు నెలల సమయం ఉన్నకారణంగా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై జరిగిన తొలి సమావేశంలో టీటీడీ అదనపు ఈవో ఇంజినీరింగ్ పనులు, వాహనాల ఫిట్‌నెస్, లడ్డూ బఫర్ స్టాక్, అన్నప్రసాదం, దర్శనం, వసతి, కళ్యాణోత్సవ కార్యక్రమాలు, ఉద్యానవన శాఖ, ట్రాన్స్‌పోర్ట్, కళ్యాణ కట్ట, గోశాల,శ్రీవారి సేవకులు, టీటీడీ విజిలెన్స్ విభాగం భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌విబిసి సిఇఒ షణ్ముఖ్‌కుమార్, సిఇ నాగేశ్వరరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అన్యాక్రాంత ప్రభుత్వ భూములను వెలికి తీస్తాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్: అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు వెలికి తీస్తామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని వాటన్నింటిపై విచారణ జరిపి ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. పెంచల నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఉద్యోగులకు వారి జీతాలు జమ చేసామని తెలిపారు.

ఎస్వీయూ అధికారులతో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉప కులపతి ఆచార్య అప్పారావు , రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు లను

చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని శనివారం విసి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని విశ్వవిద్యాలయంలో విద్యలో ప్రశాంత వాతావరణానికి, వర్సిటీ అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలందిస్తానని హామీ ఇచ్చారు. ఎస్వీయూ అధికారులు ఎంఎల్ఏ తోడ్పాటుకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఇందులో భాగంగా క్రీడా మైదానంలో పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందరూ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య, ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త టి రఘు రామన్, శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబును కలిసిన రజనీకాంత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ముఖ్యమంత్రి చంద్రబాబు ను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు మంగళగిరి టిడిపి కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్టీఆర్ మెమోరి యల్ ట్రస్ట్ పేరుపై రూ.5 వేల రూపాయల చెక్కును చంద్రబాబుకు అందిం చా రు. ఈ సందర్భం గా రజనీకాంత్

సిఎంకు చెక్కును అందిస్తున్న రజనీకాంత్ నాయుడు

మాట్లాడుతూ ముఖ్యమంత్రిని కలవాలని వచ్చేవారు తీసుకొస్తున్న బొకేలు, శాలువలకు వృథాగా డబ్బులు ఖర్చు చేయకుండా అమరావతి రాజధాని నిర్మాణానికి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణకు, ముఖ్యమంత్రి సహాయ నిధికి విరివిగా తమ వంతు విరాళాలు ఇచ్చే విధంగా పార్టీ క్యాడర్‌కు సీఎం చంద్రబాబు సూచించాలని విజ్ఞప్తి చేశానన్నారు.గత 22 సంవత్సరాలుగా టిడిపి కోసం అహర్నిశలు శ్రమించానని, తన శ్రమను గుర్తించి సముచిత ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశానన్నారు. కష్టించే వారికి టిడిపిలో సముచిత స్థానం ఎల్లప్పుడూ ఉంటుందని చంద్రబాబు చెప్పారన్నారు.

అవయవదానంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అవయవదానంపై అవగాహన లేకపోవడం వల్ల ఎందరో పేదలు మృతి చెందుతున్నారని వక్తలు ఉద్ఘాటించారు. శనివారం స్విమ్స్‌లో అవయవదానంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్విమ్స్ సంచాలకులు ఆర్‌వి కుమార్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్ఎఎంఒ డాక్టర్ కోటిరెడ్డి, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉషాకళావత్, కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మాధవి, నర్సింగ్ ప్రిన్సిపల్ సుధారాణి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

సూళ్లూరుపేట : రైతులు తమ పొలంలో మట్టిని మూడేళ్లకోసారి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.అనిత, మండల వ్యవసాయ అధికారి ఎస్.కవిత తెలిపారు.మండల పరిధిలోని కోటపోలురు గ్రామంలో ఆత్మ నెల్లూరు వారి సౌజన్యంతో రైతులకు శిక్షణ నిర్వహించారు. మట్టి పరీక్ష ఫలితాల ఆధారంగా వేయాల్సిన మోతాదులో మాత్రమే ఎరువులు వేసి నాణ్యమైన దిగుబడి సాధించవచ్చన్నారు. విఎఎలు హిమబిందు, నాగరాజు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు క్యాన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మహిళా పోలీసు సిబ్బందికి, కుటుంబ సభ్యులకు ఉచిత క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. టాటా ట్రస్టు క్యాన్సర్ ఫ్రీ ఇండియా వారి ఆధ్వర్యంలో ఎస్‌పి సుబ్బరాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమబద్ధమైన వ్యాయామం అవలంబించుకోవడం వల్ల క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకో వచ్చు న్నారు. అడిషనల్ ఎస్‌పి విమలకుమారి, పోలీసు యూనిట్ డాక్టర్ మాధురి పాల్గొన్నారు. 204 మంది మహిళలు ఈ శిబిరంలో పాల్గొని నోటి ద్వారా వచ్చే క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు సంబంధించిన పరీక్షలు చేయించుకున్నారు.

ముఖ్యమంత్రిని శ్రీసిటీకి ఆహ్వానించిన ఎమ్‌డి

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: శ్రీసిటీని సందర్శించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానించారు. రవీంద్ర సన్నారెడ్డి తన రెండు రోజుల అమరావతి పర్యటనలో భాగంగా సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శ్రీసిటీ ప్రగతిని తెలియచేస్తూ, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తు అభివృద్ధి కార్యాచరణ, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉద్యోగ ఉపాధి అవకాశాల సృష్టి తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పరిశ్రమల ఉత్పత్తులతో కూడిన 'మేడ్ ఇన్ శ్రీసిటీ' జ్ఞాపికను ముఖ్యమంత్రికి బహూకరించి, శ్రీసిటీని సందర్శించి పారిశ్రామిక ప్రగతిని వీక్షించాలని ఆహ్వానించారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. మరో సమావేశంలో డిజిపి ద్వారకా తిరుమలరావును కలిసారు.

రాజకీయ వేధింపులు మానుకోవాలి

- రేపు కలెక్టరేట్ల వద్ద ధర్నాకు తరలిరండి
- సిఐటియు నాయకుల పిలుపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చిరుద్యోగులను రాజకీయ కక్షతో అక్రమంగా తొలగించటాన్ని, వేధింపులకు గురి చేయటాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ల వద్ద ఈనెల 5వ తేదీ నిర్వహించనున్న నిరసన ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర పిలుపునిచ్చారు. పుత్తూరు సిఐటియు డివిజన్ కార్యాలయంలో సిఐటియు పట్టణ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణ కార్యదర్శి భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర , డివిజన్ కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ చిరు ఉద్యోగులకు జిల్లాలో రాజకీయ వేధింపులు తీవ్రంగా ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, సంఘ మిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లు 2,360 మందిని ఇప్పటి వరకు తొలగించారని, రాష్ట్రంలో ఇప్పటి వరకు నలుగురు చిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చిరుద్యోగులపై రాజకీయ వేధింపులను నిరసిస్తూ ఈ నెల 5వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ తొలగింపులు చట్టవ్యతిరేకమని సిఐటియు ద్వారా హైకోర్టులో కేసులు వేసి న్యాయపోరాటం చేస్తామని వివరించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు స్థానిక అధికార పార్టీ నాయకుల ఒత్తిడిలకు లొంగి వ్యవహరిస్తే న్యాయపరమైన చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. తిరుపతి జిల్లాలో సైతం ఇలాంటి ఘటనలు జరిగాయని, దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వేధింపులకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకులపై కేసులు నమోదు చేశారని, అన్ని జిల్లాల్లో ఇదే తరహాలో అధికార యంత్రాంగం వ్యవహరించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , పవన్ కళ్యాణ్, లోకేష్ లు పదేపదే రాజకీయ వేధింపులకు తాము వ్యతిరేకమని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో కొందరు అధికార పార్టీ నాయకులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు అమానుషంగా ఉందని, వీటిని తాము అంగీకరించబోమని ప్రతిఘటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు పుత్తూరు నగర అధ్యక్ష కార్యదర్శులు విజయ్, నరసింహులు, యాసిన్ బాష, రమేష్ , కె ఆర్ సుబ్రహ్మణ్యం పిళ్లై, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు , మధ్యాహ్న భోజన కార్మికులు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర

రేపు భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఉచిత ఇసుక, , దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5వ తేదీ సోమవారం నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆటో ద్వారా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శనివారం ప్రచారం ప్రారంభించారు. అనంతరం ప్రధాన సెంటర్లు మాలవ్య నగర్, సాధుపేట సెంటర్, ఎస్ఆర్ఏ సెంటర్, జిఎస్ రాయల్ సెంటర్, మసీదు సెంటర్, తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రకటించిందని, అధికారం చేపట్టి రెండు నెలలు అవుతున్నా ఈ ప్రాంతంలో ఇసుకను అందుబాటులోకి తీసుకురాలేదని దీనిపై ఈ నెల 5వ తేదీ భవన నిర్మాణ కార్మికులు నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ కార్మికులకు, ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య, సీనియర్ నాయకులు సేలం శేఖరాచారి, గండికోట మధు, ఎన్ నాగేంద్ర, ఎస్‌డి సజాద్ మేస్త్రి, బాబు మేస్త్రి (కువైట్), బండి కృష్ణయ్య, సిఐటియు నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, ఎస్ సురేష్, అడపాల ప్రసాద్, బి చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

విద్యతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్య ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తాను కూడా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడం వల్లే రాజకీయాల్లో ప్రవేశానికి అవకాశం లభించిందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కెఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. గూడూరు పట్టణంలోని ఎస్కెఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థు లకు పుస్తకాలు, యూనిఫామ్, తదితర విద్యా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ తాను ఈ కళాశాలలో చదువుకున్నానని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసు కున్నారు. 1994లో గూడూరు మున్సిపల్ ఛైర్మన్‌గా పోటీకి టిడిపి అవకాశం ఇచ్చిందని, విద్య వల్లే తనకు అవకాశం లభించిందని వివరించారు. విద్యార్థులు నిర్లక్ష్యం వహించకుండా విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జిలాని బాష, టిడిపి నాయకులు చెంచురామయ్య, శ్రీపతి బాబు, భుజగేంద్రరావు, రెండో పట్టణ సీఐ రవి కిరణ్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

తల్లి పాలు బిడ్డకు శ్రేష్టం: సిడిపిఓ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: తల్లిపాలు బిడ్డకు అమృతంలా పని చేస్తుంది అన్ని విధాలా శ్రేష్టమైందని సూళ్లూరుపేట సిడిపిఓ శారదాంబ అన్నారు. ఆమె దొరవారిసత్రం మండల పరిధిలోని ఏకొల్లు అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం ఏర్పాటు చేసిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే గంటలోపు తన ముర్రిపాలను బిడ్డకు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరువైజరు చెంచు హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు లీలమ్మ, ప్రసూన్న, ప్రేమాంజలి, వైద్య సిబ్బంది ఎంఎల్ హెచ్‌ఓ మౌనిక, ఏఎన్ఎం శ్రావణ్, ఆశా వర్కర్లు సంపూర్ణమ్మ, వీరమ్మ ఏకొల్లు ప్రాథమిక పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు మురళి, కల్లూరు మహిళా పోలీస్ సుధా, ఎంఎల్ హెచ్‌ఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఓజిలి : తల్లిపాలలో బిడ్డకు సంపూర్ణ పౌష్టికాహారం లభిస్తుందని ఐసిడిఎస్ సిడిపిఓ కే ఉమామహేశ్వరి తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డానియల్, సూపరువైజర్ ఆర్ సృజన , రమేష్, అంగన్‌వాడీ టీచర్, వాకిరి శ్యామల , పద్మ , ఏఎన్ఎం చందన పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్ : ఏర్పేడు మండలంలోని కోబాక, పోతుమానుగుంట అంగన్‌వాడీ సెంటర్లలో ఏఎన్ఎం వల్లెమ్మ, కామాక్షి మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యత, వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ గుండ్లపల్లి శిరీష వినియోగించుకోవాలని తెలిపారు.

కోట : తల్లిపాలు బిడ్డకు వరం లాంటిదని కోట అంగన్వాడి ప్రాజెక్టు సూపర్వైజర్ కృష్ణమ్మ అన్నారు. శనివారం కోట మండలంలోని కొక్కుపాడు సెక్టర్ పరిధిలో ఉన్న వావిళ్ళ దొరువు అంగన్‌వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపరువైజర్ కృష్ణమ్మ, ఏఎన్ఎమ్ కె నాగమణి,ఎం ఎస్ కె టి. వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా స్థానిక భాకరాపేట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు హంస, మునెమ్మ, చిట్టెమ్మ, పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పిచ్చాటూరు: టిడిపి ప్రభుత్వ హయాంలో విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం ఉదయం పిచ్చాటూరు జూనియర్ కళాశాలలో ఇంటరు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులను, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇళంగోవన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైతం ఈ ఏడాది నుండి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. పేద విద్యార్థుల కోసం తమ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థు లు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పిచ్చాటూరు హైస్కూల్ ప్లస్ విద్యార్థినులను స్థానిక బిసి సంక్షేమ హాస్టల్లో చేర్చుకునే విధంగా చర్యలు చేపట్టాలని హెచ్ఎం గిరి ప్రకాష్ ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే వెంటనే సంక్షేమ హాస్టల్ జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని చర్చించారు. జూనియర్ కళాశాలకు గతంలో ప్రహరీ గోడ, మరుగుదొడ్లు మంజూరు చేశామని, అయితే ఆ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయని వాటిని పూర్తి చేయడంతో పాటూ మంత్రి లోకేష్ సహకారంతో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుగంధర్ రాజు , పద్దు రాజు, బాలరాజు, రవి , ఆరుల్ ప్రకాష్, ఢిల్లీ బాబు, టిడిపి జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

విద్యార్థి ఫీజుకు నగదు అందజేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తమ్మిన పట్నం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి క్రాంతి కిరణ్ మొదటి సంవత్సరం ఫీజును జిందాల్ పవర్ లిమిటెడ్ కంపెనీ చెల్లించేందుకు ముందుకు రావడం అభినందనీయమని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిందాల్ పవర్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో విద్యార్థి క్రాంతి కిరణ్‌కు లక్ష ఇరవై వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో అందించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం కింద తమ్మిన పట్నంలో జిందాల్ పవర్ లిమిటెడ్ కంపెనీ లక్ష ఇరవై వేల రూపాయలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి క్రాంతి కిరణ్ రెండవ సంవత్సరం ఫీజు కూడా చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు మాట ఇవ్వడం అభినందనీయమన్నారు. క్రాంతి కిరణ్ కష్టపడి చదువుకొని జిందాల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో 15 వేల రూపాయల ఆర్థికసాయం అందించారు. మర్లపూడికి చెందిన నిరుపేద ఐదవ తరగతి విద్యార్థిని వరదబండి నవ్యశ్రీ ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమా దానికి గురై నారాయణాద్రి హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న ప్రగతి కుటుంబ సభ్యులు, స్నేహితు లు, దాతల ద్వారా తమ వంతు మానవతా సాయంగా ఆ చిన్నారి కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆ చిన్నారి మేనమామ వెంకు రెడ్డికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమేష్ బేకరీ అధినేత రమేష్ చేతుల మీదుగా ఆ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, సెక్రెటరీ జి. చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు కార్యవర్గ సభ్యులు శ్రీ చైతన్య శ్రీనివాసులు, వాచ్ షాపు రాము పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్ లో ఎస్ఎఫ్ఐ ప్లినరీ సమావేశం నిర్వహించారు. సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీకాళహస్తి లో హాస్టల్ సమస్యలు అలానే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలకు క్రీడా మైదానాలు ఉన్నా సరైన నిర్వహణ లేకపోవడంతో గడ్డి మొలిచి నిరుపయోగంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేల మంది విద్యార్థులు చదువుతున్నా వారికి సరిపోయే హాస్టళ్లు లేవనీ, హాస్టళ్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకంను తిరిగి ప్రారంభించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంధం మణి, ఎస్ఎఫ్ఐ నాయకులు బాల, గురువయ్య, మోహన్, డేవిడ్ చరణ్ పాల్గొన్నారు.

యువత మంచి నడవడిక కోసమే చిత్ర నిర్మాణం

- రాంగ్ కాల్ తమిళ సినిమా పూజోత్సవంలో నిర్మాత లిరిక్ ప్రసాద్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : యువత, మంచి నడవడిక కోసమే చిత్ర నిర్మాణం చేపట్టామని రాంగ్ కాల్ తమిళ సినిమా పూజోత్సవంలో చిత్ర నిర్మాత లిరిక్ ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ తేజ మూవీ మేకర్‌పై నిర్మించనున్న తమిళ సినిమా రాంగ్ కాల్ చిత్రీకరణ కోసం శనివారం పుత్తూరు పట్టణంలోని స్థానిక ఏఎంసీ కళ్యాణ మండపంలో చిత్ర నిర్మాతలు, షూటింగ్ లో ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఉండేందుకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత లిరిక్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆధునిక యుగంలో యువత, మంచి నడవడిక సాధించేందుకు ఈ సినిమా నిర్మిస్తున్నామని తెలిపారు ఈనెల 10వ తేదీ పుత్తూరు మార్కెట్ యార్డులో గ్రామీణ ప్రాంతంలో ఈ సినిమా నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సినిమాలో హీరోగా జబర్దస్త్ హీరో సుధీర్ హీరోయిన్‌గా రమ్య నటిస్తున్నట్లు తెలిపారు. దర్శకుడు సాయి విలన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో వీకే రాజేందర్, లాలు, రాజ మిత్ర, డాక్టర్ దివాకర్, కరాతి రాజన్, జెడి, విజయ్ కాంత్, కవిత, రమేష్ నాయుడు, జయచంద్ర నాయుడు, యువకులు పాల్గొన్నారు.

మహిళా టైలర్స్ కావలెను

ఆకర్షణీయమైన జీతం

నారాయణపురం విలేజ్, కోండూరు గ్రామ పంచాయతీ, అక్కంపేట పోస్ట్, తడ మండలం, తిరుపతి జిల్లా. సెల్:9177858159, 7330737619, 9393351419, అవసరం అయినవారు ఈ నెంబర్లకు కాల్ చేయగలరు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) :: PUTTUR
E.P.No: 3/2024
O.S.No: 159/2017

BETWEEN:-
Nandiboyana. Chiranjeevi **...Decree holder**

AND:-
G. Shyamala **...Judgment debtor**

NOTICE TO JUDGMENT DEBTOR

G.Shyamala, W/o G.K.R.Naidu, residing at Aaretamma Colony, K.N.Road, Puttur Town, Tirupathi District, A.P.
The D.Hr filed E.P against you for sale of E.P schedule mentioned property. The above case posted for your appearance before Hon'ble Civil Judge (Senior Division) Court, Puttur, Tirupathi District on: 07.08.2024 in person or through your advocate at about 10:30 AM and file your objections if any otherwise the matter will be decided Ex-Party.
Date of hearing: 07.08.2024.

B.Raveendra, B.Sc., B.L.,
U.S.Rayudu, M.Sc., B.L.,
K.Bhaskar, M.A., B.L.,
P.G.Venkatesh, B.Sc., B.L.,
A.Deepak., M.B.A.,L.L.B.,
Advocates/Puttur.

In The Court of the Additional Senior Civil Judge : Tirupati
I.A.No.692/2023, O.S.No.144/2023

G.D.Mehar Prasad ...Plaintiff/Petitioner
V/s
M.Subramanyam ...Defendant/Respondent

SUIT SUMMONS AND I.A. NOTICE TO RESPONDENT/DEFENDANT

Muppuru Subramanyam S/o M.Sundara rajulu, aged about 75 years, Flat No.101, Adilakshmi Apartment, Kanakabhushanam Layout, Tirupati Town, Tirupati Urban, Tirupati District.
Presently residing at D.No. Flat No.203, Suja Residency, Kanakabhushanam Layout, Tirupati Town, Tirupati Urban, Tirupati District-517501

Please take noitce that the plaintiff/ petitioner filed the above suit for specific performance of contract for execution of regular regd. Sale deed stands posted to 19.08.2024 forservice of summon and notice for your appearance. If you fail to appear in person or through an advocate and file your objections if any on the said date at 10.30 A.M. the matter will be decided in ex-parte.

(Order of the Court)
Hearing Date: 19.08.2024

KAVERIGARI NARAYANA
Advocate, Tirupati. Cell: 8008171739